అట్టడుగు వర్గాలకు అండగా ప్రభుత్వం

• గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



ఎం.రంగాపురంలో బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: గ్రామ స్థాయిలో అట్టడుగు వర్గాలకు సైతం పథకాలు అందుతున్నాయి. పారదర్శకంగా సంక్షేమ పథకాలు మంజూరు చేసి మా కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మళ్లీ మద్దతు ఇస్తామని లబ్ధిదారులు, మహిళలు తెలిపారు. మండల పరిధిలోని మణూరు సచివాలయం పరిధిలోని ఎం.రంగాపురం, వైజీపీ తండాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటికి లబ్ధి పొందిన బుక్‌లెట్లను అందజేశారు. అలాగే ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటి వద్దకు వెళ్లినా.. తమ కుటుంబానికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని లబ్ధిదారులు సంతోషంతో తెలిపారు. సీఎం జగనన్న పరిపాలనలో తమకు ఎంతో మేలు జరిగిందని.. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు అండగా ఉంటామని మహిళలు స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలపై టీడీపీ నాయకుల చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కకుండా చంద్రబాబు నాయుడు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సర్పంచ్ రామలింగమ్మ, సింగల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, మూర్తి, ఎంపీటీసీ సునీత, మాజీ ఎంపీపీ బజ్జప్ప, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, కన్వీనర్ ప్రభాకర్, వివిధ కమిటీల నాయకులు సత్యనారాయణ, జమ్మానిపల్లి మూర్తి, జిల్లెడుగుంట మంజునాథ్, రంగనాథ్, నాయక్, నాగభూషణరెడ్డి, కార్యదర్శి ఆనంద్ కుమార్, ఈఓఆర్డీ శైలజ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

మడకశిర: టీటీడీ పాలకమండలి చోటు దక్కించుకున్న ఎమ్మెల్యే తిప్పేస్వామిని శనివారం నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందించారు. అలాగే మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపుం మండలాలకు చెందిన నాయకులు కూడా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: వచ్చే ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని ఎమ్మెల్యే తిప్పేస్వామి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లతో సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. అన్ని సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైస్ జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని కోరారు. ముఖ్యమంత్రిపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మెన్లు రామచంద్రారెడ్డి, వెంకటలక్ష్మమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ మూర్తి, జేసీఎస్ కన్వీనర్లు విక్రమ్, శివకుమార్, శివన్న, నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర యాదవ్, నాయకులు సత్యనారాయణరెడ్డి, జయరాజ్, నాగభూషణ్ రెడ్డి, త్రిలోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న సర్పంచ్, కార్యదర్శులు

లేపాక్షి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చేనేత ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న మురుగు నీరు దుర్వాసన వస్తోందని సర్పంచ్ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. శనివారం ఉదయం ప్రజల ఫిర్యాదు మేరకు వారు ఆ ఫ్యాక్టరీని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దుర్వాసన నివారించడానికి అవసరమైన పారిశుధ్య చర్యలు తీసుకోవాలని మేనేజర్ జనార్దన్‌కు సూచించారు. స్పందించిన మేనేజర్.. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బోర్ల అంజినరెడ్డి, వెంకటేశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిరరూరల్: మండల పరిధిలోని మణూరు గ్రామ సచివాలయం పరిధిలోని ఉప్పిడిపల్లిలో ఆదివారం ఉదయం 9 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రామలింగమ్మ, ఎంపీపీ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

29న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నిక

పెనుకొండ రూరల్: నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ భాస్కర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన సింగిల్‌విండో పద్ధతిలో ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని శాఖల ఉద్యోగులు విధిగా పాల్గొని కార్యవర్గ ఏర్పాటుకు సహకారించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సంబరాలు



వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: టీటీడీ పాలకమండలిలో ఎమ్మెల్యే తిప్పేస్వామికి చోటు దక్కడంతో శనివారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ కృష్ణమూర్తి, జయరాజ్, రమేష్, విక్రమ్, వెంకటలక్ష్మమ్మ, అన్సర్, శ్రీనివాసులు, అంజన్, మధు, గోపి, అంజలి, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆటో



చికిత్స పొందుతున్న స్టాఫ్‌నర్స్ సుజాత

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుజాతను గుర్తు తెలియని ఓ ఆటో శనివారం ఉదయం ఢీకొట్టింది. వివరాలు.. స్టాఫ్‌నర్స్ సుజాత విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరింది. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని చేరుకోగానే.. ద్విచక్ర వాహనాన్ని ఓ ఆటో ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో గాయపడిన సుజాతను స్థానికులు చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రామాంజినేయులు ఆస్పత్రికి వెళ్లి జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఆటో డ్రైవర్‌ను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

పాఠశాలలో వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ అనూషతో పాటు ఏఎన్ఎం గంగాదేవి తదితరులు 150 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుధామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురిటి బిడ్డ మరణాన్ని నమోదు చేయలేదు

• ఎంపీడీఓ తనిఖీల్లో వెలుగులోకి వాస్తవాలు

సాక్షి ఎఫెక్ట్..



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేష్ కృష్ణ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 'వివాదాలకు కేరాఫ్ చిలమత్తూరు పీహెచ్‌సీ' అనే శీర్షికతో ఈనెల 24న సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన ఎంపీడీఓ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. మార్చి 28న ప్రసవం కోసం వచ్చిన కొడికొండకు చెందిన సుజాతకు పురుడు పోసే క్రమంలో మరణించిన విషయంపై ఆరా తీశారు. రికార్డుల్లో ప్రసవం వివరాలు నమోదు చేయకపోవడాన్ని గుర్తించారు. ప్రసవానికి వచ్చిన గర్భిణి వివరాలు ఎందుకు నమోదు చేయలేదని సిబ్బందిని ప్రశ్నించారు. కొడికొండకు చెందిన ఏఎన్ఎం సంజీవమ్మతో ఆయన మాట్లాడారు. పురిటి బిడ్డ మరణాన్ని దాచాల్సి వచ్చిందన్న విషయంపై సమగ్రమైన దర్యాప్తు జరగాల్సి ఉందన్నారు. మార్చి 28న వైద్యాధికారి సీఎల్ అని ఎందుకు దిద్దుంది అని, ఆరోజు డాక్టర్లు ఎవరు అందుబాటులో ఉన్నారు? ప్రసవం చేసిన డాక్టర్ తేజశ్విని తప్పుందా.? అనే విషయాలపై విచారణ జరగాల్సి ఉందన్నారు. ఇదే విషయంపై డాక్టర్ రామకృష్ణను సంప్రదించగా.. మార్చి 28న తాను డ్యూటీలో ఉన్నానని తెలిపారు. ఇతర పనుల్లో ఉన్న తనకు ప్రసవం చేసిన విషయాన్ని డాక్టర్ తేజశ్విని కానీ, ఏఎన్ఎంలు కాని తన దృష్టికి తీసుకురాలేదన్నారు. ప్రసవాలను మహిళా వైద్యులు అందుబాటులో ఉంటే వారే చేస్తారని, అయితే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ఈ విషయంపై మరో డాక్టర్ తేజశ్విని సంప్రదించేందుకు ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదు.

సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గీత

పెనుకొండ: ప్రజా సమస్యలపై మండల స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీపీ గీత సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు గైర్హాజరు కావడం సరికాదన్నారు. కొందరు ఆలస్యంగా వస్తుండటంతో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు అవకాశం లేకుండా పోతోందన్నారు. ఏపీఓ జయమ్మ మాట్లాడుతూ.. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యాక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు చేపట్టిన పనులపై వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ శివశంకరప్ప, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, ఎంపీటీసీలు శివయ్య, జ్యోతి, నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, సర్పంచ్‌లు అశ్వర్థప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు వేగవంతం చేయండి



బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నయ్య

రొళ్ల: గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నయ్య పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో రొళ్ల, అగళి మండలాల బూత్ లెవెల్ అధికారులకు ఓటరు నమోదుపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఓటరు జాబితాలోకి చేర్చేందుకు ఫారం–6 స్వీకరించాలన్నారు. ఇది వరకే ఓటరు జాబితాలో పేర్లు ఉండి చేర్పులు, మార్పులు, తొలగింపులు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, అగళి తహసీల్దార్ జమానుల్లాఖాన్, బూత్ లెవెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, నారా లోకేశ్‌పై చర్యలు తీసుకోండి



మడకశిర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం నాయకులు కోరారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో 2019 నుంచి 2024 వరకూ ఎక్కువ కేసులున్న టీడీపీ నాయకులకే నామినేటెడ్ పదవులు ఇస్తామంటూ లోకేశ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో గొడవలు, అల్లర్లు జరిగి రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేసే చంద్రబాబు, నారా లోకేశ్, అచ్చెన్నాయుడుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం నాయకులు జయరాజ్, నగేష్, చిరు, జేసీఎస్ మండల కన్వీనర్ విక్రమ్, స్థానిక నాయకులు మేఘన రమేష్, అన్సర్, శ్రీనివాసులు, సుధాకర్, ఫక్రుద్దీన్, సైపుల్లా, గోపి, చంద్ర, రాజశేఖర్, రవీంద్రారెడ్డి, హారున్‌బాషా, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి



పావగడ: పూల మంటప రథంలో ఊరేగుతున్న జ్యేష్టాదేవి, శనీశ్వరుడు



అమరాపురం: అలంకరణలో శనీశ్వరస్వామి



లక్ష్మీనరసింహస్వామి అలంకరణలో పేట వెంకటరమణ స్వామి

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శనివారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. హిందూపురంలో లక్ష్మీనరసింహ స్వామి అలంకరణలో పేట వెంకటరమణ స్వామి దర్శనమిచ్చారు. పావగడలో పూల మంటప రథంలో జ్యేష్టాదేవి సమేత శనీశ్వర స్వామిని ఊరేగించారు. అలాగే రొళ్ల, అమరాపురం, అగళి, అమరాపురం, మడకశిరలోని ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది.

– సాక్షినెట్‌వర్క్:

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీజే శైలజ

హిందూపురం టౌన్: పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం సాధించొచ్చని అదనపు జిల్లా జడ్జి శైలజ అన్నారు. శనివారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీజే శైలజ మాట్లాడుతూ.. నేటి సమాజంలో చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థినులు ఉన్నత ఆశయంతో విద్యాభ్యాసం సాగించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినులు, మహిళల కోసం ప్రత్యేకంగా ఎన్నో చట్టాలు ఉన్నాయని తెలిపారు. వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలు, నీటి ప్లాంటును పరిశీలించారు. కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు సంతోషి కుమారి, పార్వతి, నవేరా, ఎస్ఐ భాస్కర ప్రసాద్, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

రుద్రపాద ఆశ్రమంలో పూజలు



అలంకరణలో శివపార్వతులు

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన రుద్రపాద ఆశ్రమంలో శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి శనివారం ఆలయంలో పూజలు చేస్తామని అర్చకులు తెలిపారు.

బొడ్రాయికి 101 బిందెలతో అభిషేకం



గొట్లుగుర్కిలో బొడ్రాయికి నీళ్లతో అభిషేకం చేస్తున్న మహిళలు

రొళ్ల: వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థిస్తూ శనివారం మండల పరిధిలోని గొట్లుగుర్కిలో ఉన్న పురాతన బొడ్రాయికి 101 బిందెల నీటితో మహిళలు అభిషేకం చేశారు. అలాగే గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి రెండో శ్రావణ శనివారం సందర్భంగా మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఎంపీటీసీ లింగరాజు పాల్గొన్నారు.

విస్తరంగా వర్షాలు..

రొళ్ల: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి ఓ మోస్తారు వర్షం కురిసింది. రాత్రి 7:45 గంటల నుంచి 9 గంటల వరకు వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

105 మందికి వైద్య పరీక్షలు

హిందూపురం: లేపాక్షి మండలం సడ్లపల్లి పంచాయతీ తిలక్‌నగర్‌లో వాసవ్య మహిళా మండలి, కుశల్ హెల్త్‌కేర్ సెంటర్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విప్రోకేర్ కంపెనీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 105 మందికి డాక్టర్ చక్రతేజారెడ్డి వైద్య పరీక్షలు చేశారు. మరో 26 మందికి రక్తపరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా మండలి డైరెక్టర్ విజయ్‌కుమార్, మల్లేశ్వరి, కృష్ణవేణి, లక్ష్మమ్మ, రాధమ్మ, సువర్ణలక్ష్మి, హెచ్ఎం శివయ్య, ఏఎన్ఎం పుష్ప పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయాలి

రొద్దం: మండల కేంద్రంలో 2021లో రూ.1.75 కోట్లతో ప్రారంభించిన 20 పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చంద్రశేఖర్ జిల్లా సర్వసభ్య సమావేశంలో సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే టెండర్ పూర్తి కాగా.. పునాదులు వేసి పనులు మొదలు పెట్టారని తెలిపారు. అయితే కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని వివరించారు. అదేవిధంగా ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల గదుల నిర్మాణానికి రూ.33 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పాఠశాల నిర్మాణ పనులు కూడా జరగడం లేదన్నారు. గదుల కొరతతో దాదాపు 500 మంది విద్యార్థులకు ఇబ్బందిగా ఉందన్నారు. పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మండలాభివృద్ధికి సహకరించాలి



మంత్రి ఉషశ్రీ చరణ్‌కు సమస్యలు విన్నవిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క

అమరాపురం: మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను సత్వరం పరిష్కరించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క కోరారు. శనివారం అనంతపురంలో జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను వేర్వేరుగా కలిసి సమస్యలు విన్నవించారు. వివిధ గ్రామాల్లో అర్ధాంతరంగా ఆగిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో బకాయి పడిన వాటర్‌షెడ్ బిల్లుల చెల్లింపు, అమరాపురం నుంచి కర్ణాటక బార్డర్ విరుపసముద్రం వరకూ అర్ధాంతరంగా ఆగిన డబల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అమరాపురం నుంచి పుల్లికుంట గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని విన్నవించారు. సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంపులో ప్రతిభ



విజేతలతో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, ఎన్‌సీసీ అధికారి అరుణ్‌బాబు

పరిగి: ఉమ్మడి అనంతపురం జిల్లా బ్రాహ్మణపల్లిలో ఈనెల 16 నుంచి 25 వరకూ జరిగిన ఎన్‌సీసీ కంబైన్డ్ మాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు వివిధ కాంపిటేషన్లలో బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, పాఠశాల ఎన్‌సీసీ అధికారి అరుణ్‌బాబు తెలిపారు. ఇందులో ఫైరింగ్ కాంపిటేషన్‌లో లక్ష్మీనరసింహారెడ్డి, కృష్ణచైతన్య, విజయ్, డ్రాయింగ్ కాంపిటేషన్‌లో లక్ష్మీనరసింహారెడ్డి, వాలీబాల్ విన్నర్ టీంలో మనోజ్‌కుమార్, సాయిచరణ్, నరసింహా, డార్డ బాల్‌లో లక్ష్మీనరసింహారెడ్డి, జశ్వంత్, చంద్రశేఖర్, విజయ్, నరసింహా, హర్షవర్ధన్, బెస్ట్ సింగర్‌గా ఆదర్శ్ రామ్‌రక్షిత్‌రెడ్డి విజయం సాధించారన్నారు.

'జాబిలి'కి సర్వేపల్లి జీవన సాఫల్య పురస్కారం



పెనుకొండ: హిందీ ఉపాధ్యాయుడు జాబిలి చాంద్‌బాషాకు సర్వేపల్లి రాధాకృష్ణ జీవన సాఫల్య పురస్కారం దక్కింది. ఇంటర్నేషనల్ ఐఎస్ఓ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ నిర్వాహకులు ఈ పురస్కారాన్ని ఆన్‌లైన్ వేదికగా ప్రకటించారు.

శనీశ్వరుడి దర్శనానికి భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

మడకశిర: పావగడలోని శనీశ్వరుడి దర్శనానికి శనివారం మడకశిర నుంచి భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. రెండో శ్రావణ శనివారం సందర్భంగా తొలుత పట్టణంలోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పావగడకు పాదయాత్రగా తరలివెళ్లారు. పావగడకు చేరుకున్న అనంతరం భక్తులు శనేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా బాబావలి

హిందూపురం టౌన్: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన బాబావలి మరోసారి ఎన్నికయ్యారు. కదిరిలో ఈనెల 24, 25వ తేదీల్లో ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా ప్లీనరీ సమావేశాలు నిర్వహించారు. 19 మందితో ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు ముందుంటానన్నారు.